క్లుప్తంగా

షిల్ట్ తొలగింపుకు చర్యలు



తెనాలిఅర్బన్: రైల్వే ట్రాక్ కింద ఉన్న మురుగు కాల్వల్లో షిల్ట్ తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 32వ వార్డు యడ్ల లింగయ్య కాలనీలోని రైల్వే ట్రాక్ కింద ఉన్న మురుగు కాల్వలో మంగళవారం చేపట్టిన షిల్ట్ పనులను ఆమె పరిశీలించారు. షిల్ట్ ఎక్కువగా ఉండటం వలన మురుగు పారుదల నిలిచిపోయిందని చెప్పారు. రైల్వే అధికారుల సహకారంతో పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఆమె వెంట ఎంఈ నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మట్లపూడి రాజేశ్వరరావు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

పెన్షనర్ల సంఘం ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌లు అందజేస్తాం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్‌లు తమ లైఫ్ సర్టిఫికెట్లను గురువారంలోగా ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని తెనాలి పెన్షనర్ల సంఘ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణ, సూర్యప్రకాశరావులు ఒక ప్రకటనలో తెలిపారు. లేవలేని స్థితిలో ఉన్నవారి వివరాలు తమకు తెలియజేస్తే వాటిని అందజేసేందుకు సహకరిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు రెండు వేల లైఫ్ సర్టిఫికెట్‌లు తమ సంస్థ ద్వారా అందజేయడం జరిగిందని అన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం మెర్సీ జోన్స్ మృతి



తెనాలిరూరల్: తెనాలి మండలం మల్లెపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ఉన్నం మెర్సీజోన్స్(87) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మల్లెపాడులోని స్వగృహంలో ఉంచిన మృతదేహానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్ కుమార్ దంపతులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. 42 ఏళ్ల పాటు ఉపాధ్యాయిని, ప్రధానోపాధ్యాయురాలుగా తెనాలి పురపాలక సంఘంలో విశేష సేవలు అందించిన మెర్సీజోన్స్‌కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

ఉద్యోగి అదృశ్యంపై కేసు

తెనాలిరూరల్: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం వరికూటివారిపాలెంకు చెందిన నందూరి అచ్యుత వెంకటరామ్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల్లో ఉంటూ విధులకు వెళుతుండేవాడు. ఈ నెల 24వ తేదీన విధులకు వెళుతున్నట్టు చెప్పి వెళ్లి కనబడకుండా పోయాడు. వెంకటరామ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం రాత్రి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: తెనాలి ఐతానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమానులు తాళం వేసి కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. ఇంటికి వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండడం మంగళవారం ఉదయం చూసిన బంధువులు వారికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించే ప్రయత్నం చేశారు. ఇంటి యజమానులు వచ్చి ఫిర్యాదు చేస్తే ఎంత సొత్తు అపహరణకు గురైందన్న విషయమై స్పష్టత వస్తుంది. దీనిపై రాత్రి వరకు పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: వరకట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఖాజీపేటకు చెందిన పులిగడ్డ దివ్య తనను భర్త శ్రీనివాసరావు అధిక కట్నం తెమ్మంటూ మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు.

విస్తృతంగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు

- వైద్య సేవలు పొందుతున్న ఎక్కువ మంది ప్రజలు
- రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య

తెనాలిఅర్బన్: తెనాలి పాండురంగపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పేద ప్రజలకు చేరువయింది. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. దీంతో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను విస్తృతం చేయటంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించింది.

+ తెనాలి పట్టణ పరిధిలోని 24, 25, 26, 27 వార్డుల ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పాండురంగపేటలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను జూన్–2021లో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి పాండురంగపేటలోని ఓ అద్దె భవనంలో దీనిని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు.

రూ.1.10 కోట్లతో నూతన భవనం..

అర్బన్ హెల్త్ సెంటర్‌ను శాశ్వత భవనంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అసవరమైన చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సుల్తానాబాద్‌లోని ఆలపాటి నగర్‌లో అధికారులు స్థలం కేటాయించారు. రూ.1.10 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణం చివరి దశలో ఉంది. నెలరోజులలోపు పనులు పూర్తి అయ్యే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ఏడాదికి సుమారు ఏడు వేల మందికి సేవలు..



పాండురంగపేటలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



ఆలపాటినగర్‌లో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం



అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగికి బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది

పాండురంగపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రోజుకు సగటున 30 నుంచి 40 మంది వరకు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ఏడాదికి సుమారు ఏడు వేల మంది ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. అంతేకాకుండా అక్కడ ఏర్పాటు చేసిన రక్త, మూత్ర, కళ్ళ పరీక్షలను నెలకు సుమారు 300 మందికి పైగా చేయించుకుంటున్నారు.

గర్భిణులకు ప్రత్యేక సేవలు..

అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని వార్డులలో నివసించే గర్భిణులకు సేవలందించేందుకు ఐదుగురు ఏఎన్‌ఎంలను ప్రభుత్వం నియమించింది. వారు ఆయా వార్డులలో గర్భిణులను గుర్తించి వారికి ప్రతినెల చెకప్‌లు చేయించటం, వారిలో ఇతర సమస్యలు ఏమైనా ఏర్పడితే అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంటారు. అంతేకాకుండా జిల్లా వైద్యశాలకు వారిని పంపి చికిత్స అందించేలా చూస్తారు. అలాగే రక్తహీనతకు మందులు సకాలంలో అందిస్తారు. బలవర్ధక ఆహారం తీసుకునేలా వారిలో చైతన్యం తెస్తారు. సాధారణ ప్రసవం జరిగేందుకు అవసరమైన సూచనలు ఇస్తారు. అలాగే సకాలంలో టీకాలు వేయించటం, డెలివరీ అయ్యే వరకు వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తారు. అంతేకాకుండా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తారు.

అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను ఉపయోగించుకోండి..



డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అనేక రకాల వైద్య సేవలు అందించటం జరుగుతుంది. షుగర్, బీపీ, ఇతర 63 రకాల పరీక్షలు ఇక్కడ చేస్తున్నాం. అవసరమైన వారికి టీకాలు, మందులు కూడా ఇక్కడే అందిస్తున్నాం. ఈ ప్రాంతంలోని ప్రజలు అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను ఉపయోగించుకోండి.

–డాక్టర్ హర్షవర్ధన్, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

షుగర్, బీపీ, టీబీకి చికిత్స పొందుతున్నాను..



నేను షుగర్, బీపీ, ఆయాసంతో బాధపడుతున్నాను. వాటి చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నాను. ఇటీవల టీబీ కూడా సోకిందని వివిధ పరీక్షల ద్వారా వైద్యులు నిర్ధారించారు. దీంతో దానికి కూడా ఇక్కడే చికిత్స పొందుతున్నాను. ఇక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది మాకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నారు.

–సిద్దులూరి ధనలక్ష్మి, పినపాడు, తెనాలి

వైద్యులు, సిబ్బంది సేవలు బాగున్నాయి..



నాకు షుగర్, బీపీ ఉంది. వాటి చికిత్స కోసం ప్రతినెల ఇక్కడికి వస్తున్నాను. ఇక్కడి వైద్యులు, సిబ్బంది రోగులు వచ్చిన వెంటనే వారికి అవసరమైన పరీక్షలు చేస్తున్నారు. అలాగే రిపోర్ట్‌లు త్వరగా ఇవ్వటంతో పాటు అవసరమైన మందులు కూడా ఇస్తున్నారు. అక్కడి వైద్యులు, సిబ్బంది అందించే సేవలు బాగున్నాయి.

–షేక్ జాన్‌బీ, పాండురంగపేట, తెనాలి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు..



పేదలు నివసించే ప్రాంతాలలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు సీఎం జగన్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రోగులకు అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచారు. మాకు చిన్న సమస్య వచ్చినా వెంటనే ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నాం. కుక్క, పాము కాటు వంటి వాటికి కూడా ఇక్కడ ఇంజక్షన్‌లు చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–షేక్ హాసిన్, పాండురంగపేట, తెనాలి

కొల్లిపర మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: కొల్లిపరలో నిర్మించనున్న మార్కెట్ యార్డు నిర్మాణానికి మార్గం సుగమం అయిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో రైతులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహించిన వైఎస్సార్ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఆ సందర్భంలో కొల్లిపర రైతులు తమకు తమ ప్రాంతంలో ఒక మినీ మార్కెట్ యార్డు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారన్నారు. అప్పుడు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆ ప్రాంతంలో భూమి ఉన్న రైతులతో మాట్లాడి 4.21 ఎకరాలకు అగ్రిమెంట్ అయిందన్నారు. త్వరలోనే దీనిని రిజిస్ట్రేషన్ చేయించి మార్కెట్ యార్డు నిర్మాణం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జేసీ రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, కలెక్టరేట్ ఏఓ జానకి పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి హిందీ వేసవి తరగతులు

తెనాలి: స్థానిక నాజరుపేటలోని హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయంలో మార్చి 1వ తేదీ నుంచి ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు వేసవి తరగతులను నిర్వహించనున్నట్లు ప్రేమీ మండలి అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, కార్యదర్శి ఈలప్రోలు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి

తెనాలిఅర్బన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. 20వ వార్డులో మంగళవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెనాలి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కొల్లా గురునాధగుప్తా, గోల్డ్ రహిమా, షేక్ జాకీర్, కె.కిరణ్, షేక్ గఫూర్, బి.శ్రీనివాసరావు, టి.సురేష్, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, కొర్ర యశోద, కఠారి రత్నకుమారి, దామర్ల విజయరాణి, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రాళ్ళబండి సుష్మ, మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, ఆళ్ళమూరి విజయలక్ష్మి, గాలి అరవింద, నిర్మల, బట్టు అంజలి, బ్రహ్మం, దేవరపల్లి కిషోర్, కఠారి హరీష్, సిరి కృష్ణ, చుండూరు సాయి, పోతవరపుల పురుషోత్తమశర్మ, కాకి దేవసహాయం, తట్టుకుళ్ళ అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

తెనాలిఅర్బన్: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని 5వ వార్డులో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



20వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు వీర్లపాటి విజయలక్ష్మి, తోట రఘురామ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజలక్ష్మి, బాలరాజు, వేముల మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తేలప్రోలులో..

తెనాలి మండలం తేలప్రోలు గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పెద్దకుమారుడు సత్యనారాయణ మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ షేక్ బాషా, ఎంపీటీసీ షేక్ ఇలియాజ్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ గాలబ్, షేక్ ముజీర్, అన్వర్ జానీ, సయ్యద్ ఇమామ్, సయ్యద్ జానీబాషా, కొండమూడి దానయ్య, సిద్దెల కోటేశ్వరరావు, బొంతు నరేంద్రరెడ్డి, కానుగోలు సురేష్, పినపాటి అనిల్ పాల్గొన్నారు.



5వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నాగవేణి



తేలప్రోలులో కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సత్యనారాయణ

గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు

దావులూరు(కొల్లిపర): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. మంగళవారం మండలంలోని దావులూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు, పౌష్టిక ఆహారం ఏ మేరకు తీసుకోవాలన్న అంశాలను వివరించారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు తెలిపి వారికి కావాల్సిన మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారుల ఎత్తు, బరువు పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, 104 సిబ్బంది కోటిరెడ్డి, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ

బీసీలకు దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలి

రాజకీయ పార్టీలకు కేసన శంకరరావు వినతి



తెనాలి: భారతీయ సమాజంలో 54 శాతం బలహీనవర్గాలుగా ఉన్న 139 బీసీ కులాలకు అసెంబ్లీ ఎన్నికల్లో తగినన్ని సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. కేవలం డబ్బుగల వాళ్లకి, పెద్దకులాల వాళ్లకు మాత్రమే పార్టీ టికెట్లు కేటాయిస్తున్నారు తప్ప నిజాయితీగా ప్రజలకు సేవచేసేవారికి అటు ఓసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లోనూ టికెట్లు ఇవ్వటం లేదని మంగళవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు చెందిన డబ్బున్న పైరవీకారులైన బీసీ నేతలకు టికెట్లు ఇవ్వడం కాదని, చిత్తశుద్ధి, అంకితభావంతో బీసీల సమస్యలపై అనునిత్యం కృషిచేస్తున్న బీసీ సంఘాల నాయకులకు మాత్రమే అన్ని పార్టీలు టికెట్లు ఇచ్చి, ఆర్థికసాయం చేసి గెలిపించుకుని తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. ఇటీవల టీడీపీ–జనసేన కూటమి ప్రకటించిన 99 ఎమ్మెల్యే టికెట్ల జాబితాలో కూడా కమ్మకు–21, రెడ్లకు–17, కాపులకు–12 సీట్లు కేటాయించి, బీసీలకు మాత్రం 18 సీట్లు మాత్రమే ఇవ్వటం బీసీ నేతగా అవమానంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మిగిలిన 76 సీట్లలోనైనా బీసీలకు అధిక సీట్లు ఇవ్వాలని కోరారు. అధికార పార్టీ కూడా బీసీలకు సముచిత సంఖ్యలో టికెట్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

తెనాలిరూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ ఎల్.సరస్వతి మంగళవారం రాత్రి తెలిపారు. ఇటీవలి కాలంలో తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో రైళ్లలో చోరీపై రెండు కేసులు నమోదయ్యాయి. సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. వీటిని 01/24, 24/24గా నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను పొన్నూరుకు చెందిన షేక్ సైదా(ప్రస్తుతం బాపట్లలో నివసిస్తున్నాడు), పొన్నూరుకే చెందిన షేక్‌మస్తాన్‌బీగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా బంగారు గొలుసు, మూడు ఉంగరాలు, వజ్రంతో ఉన్న చెవి దిద్దులు, ఐఫోన్ లభించాయి. నిందితులు తెలిపిన సమాచారం మేరకు వస్తువులను స్వాధీనపర్చుకుని వారిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.1.54 లక్షలు ఉంటుందని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ సరస్వతి

అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి



తెనాలిఅర్బన్: ఐతానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఐతానగర్, ఉడాకాలనీ, ఇందిరానగర్ కాలనీలలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈ నాగమల్లేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు తదితరులున్నారు.

బ్యాంక్‌లోన్ ఇప్పిస్తానంటూ ఘరానా మోసం

చికెన్ షాపు నిర్వాహకుడి వద్ద నుంచి రూ.15వేలు నగదు కాజేసిన యువకుడు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రోడ్‌లో ఓ చికెన్ షాప్ యజమానికి లోన్ ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేసి ఆయన ఖాతాలో డబ్బులను మాయం చేసి పరారైన ఘటన వెలుగు చూసింది. మంగళవారం చికెన్ షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి పోలకంపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే చికెన్ వ్యాపారి మంగళగిరి యర్రబాలెం రోడ్‌లో చికెన్ షాపు నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన పేరు సాయి సందీప్‌గా తాను బ్యాంకులో పనిచేస్తున్నానని పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి శ్రీనివాసరావును నమ్మించాడు. శ్రీనివాసరావును మాటల్లో పెట్టి తన వద్ద ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకుని శ్రీనివాసరావు అకౌంట్‌లో ఉన్న రూ.15 వేల నగదును ఫోన్‌పే ద్వారా కృష్ణాజిల్లా పోరంకికి చెందిన మొక్కపాటి నాగ ఫణీంద్రకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం అక్కడి నుంచి సాయి సందీప్ బండిపై ఉడాయించాడు. ఖాతా నుంచి ఫోన్‌పే ద్వారా రూ.15 వేలు వేరే ఫోన్ నెంబర్‌కు బదిలీ అయిన విషయం గమనించిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించగా శ్రీనివాసరావు ఫోన్ నుంచి నగదు బదిలీ చేసిన నెంబర్‌ను సంప్రదించారు. తన పేరు నాగ ఫణీంద్ర అని, ఫణీంద్ర ఫోన్ పేకు సాయి సందీప్ డబ్బులు పంపాడని, తిరిగి సాయి సందీప్‌కు డబ్బులు చెల్లించానని తెలపడంతో ఫణీంద్ర ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న సాయి సందీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడి వద్ద నుంచి మరింత సమాచారం సేకరిస్తున్నట్లు సీఐ మధుసూదనరావు తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి దురాగతాలు

ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలకు నిప్పు పెట్టి పరారు

తాడేపల్లిరూరల్ : మద్యం మత్తులో ఓ యువకుడు మంగళవారం తెల్లవారు జామున రోడ్డు వెంబడి పార్క్ చేసి ఉన్న కారుతో పాటు రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టడంతో కారు పాక్షికంగా కాలగా, రెండు ద్విచక్రవాహనాలు, సైకిల్ పూర్తిగా దగ్ధమయ్యాయి. జరిగిన ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ప్రాంతంలో విచారణ చేపట్టి వాహనాలను దగ్ధం చేసిన వ్యక్తి తలగాల దుర్గా ప్రసాద్‌గా గుర్తించారు. సీఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం సీతానగరం ఆయుర్వేద వైద్యశాల వద్ద నివాసముంటున్న లోలాకుల నవీన్‌కుమార్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా, పెద్దపెరిగె వెంకటేశ్వర్లు ఇస్త్రీ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ రాత్రి సమయంలో 10 గంటల తర్వాత తమ నివాసాల ముందు ద్విచక్రవాహనాలను పార్క్ చేసుకున్నారు. వెంకటేశ్వర్లు ఇంటిముందు సైకిల్ కూడా పార్క్ చేసి ఉంది. ఆ పక్క బజారులో నివసించే కుంబా రమేష్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కారునూ ఇంటిముందు పార్క్ చేసుకున్నాడు. తెల్లవారు జామున రెండు గంటల సమయంలో అదే ప్రాంతంలో నివసించే తలగాల దుర్గా ప్రసాద్ మొదట రెండు ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టగా పక్కనే ఉన్న సైకిల్ కూడా కాలిపోయింది. ఆ రెండు వాహనాలు తగలబెట్టిన అనంతరం పక్క వీధిలో కుంబా రమేష్ కార్ పార్క్‌చేసి ఉండగా కారుమీద సిగరెట్ పడవేశాడు. మద్యం అలవాటు ఉన్న దుర్గాప్రసాద్‌కు నరాల బలహీనత ఉండడంతో మందులు వాడుతున్నాడని, మద్యం, మందుల మత్తులో ఇలా ప్రవర్తించాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారని చెప్పారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ ఇంటి వద్ద లేడని జరిగిన సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



తగలబడిన ద్విచక్ర వాహనాలు, సైకిల్

శిల్పకారుడు కాటూరికి సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావును త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సత్కరించారు. నూతన వస్త్రాలను బహూకరించారు. తెనాలి బండ్‌పై తొలిగా అర్చకోద్యమ పితామహుడు టి.రామాచార్యులు విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సభలో ఆ విగ్రహాన్ని రూపొందించిన శిల్పకళాకారుడిగా కాటూరిని రామాచార్య స్మారక సమితి తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని సజీవం అనిపించేలా తీర్చిదిద్దిన శిల్పకారుడిని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహా వేదికపై ప్రముఖులంతా అభినందించారు.

నేడు పోలకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులో వేంచేసి యున్న శ్రీ పోలకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అమ్మవారి 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.